క్లుప్తంగా

7నుంచి ఫార్మెటివ్-3 పరీక్షలు

నల్లజర్ల: ఈనెల7వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఫార్మెటివ్-3 పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు మండల విద్యాశాఖాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. గత ఫార్మెటివ్ మాదిరిగానే ఓఎంఆర్ షీటు ఇస్తారు. దీంతో పాటు రాత పరీక్షకు ప్రశ్నలుంటాయి. రోజుకు రెండు పరీక్షలు చొప్పున ఈనెల 10 వతేదీ వరకు నిర్వహించనున్నారు. 1నుంచి 8 తరగతుల విద్యార్థులకు తరగతి గది ఆధారిత అంచనా (క్లాస్‌రూం బేస్డ్ అస్మెంట్) 9,10 తరగతులకు ఎఫ్ఏ-3గా పరిగణిస్తారు. 1-5 తరగతుల వారి ప్రశ్నాపత్రాలను తొలుత మండల కేంద్రం నుంచి పాఠశాల సముదాయంలోని హెచ్ఎం వాటిని ఏరోజుకు ఆరోజు పరీక్షకు ఒక గంట ముందు పాఠశాలలకు పంపించాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీట్లు మాత్రం 5న పాఠశాలలకు పంపిణీ చేస్తారు.

క్రీడల్లో సత్తా చాటిన తాళ్లపూడి విద్యార్థులు



తాళ్లపూడిలో క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని పరస పద్మరాజారావు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్17 విభాగంలో బాక్సింగ్‌లో 80 కేజీల విభాగంలో 10వ తరగతి చదువుతున్న సాధనాల సుప్రజ రెండో స్థానం సాధించి సిల్వర్ మెడల్ సాధించినట్టు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. కబడ్డీలో కొడమంచిలి సందీప్, త్రోబాల్‌లో గోళ్ల సంతోష్, ఎం పండులు పతకాలు సాధించారన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు వైఎస్ఎస్ మూర్తి, పీడీ శ్రీలక్ష్మి అభినందించారు.

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ టి రాధిక, ఏఎస్‌వోలను సత్కరిస్తున్న ఉద్యోగులు

తాళ్లపూడి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతులు మీదుగా ఉత్తమ సహాయ రిటర్నింగ్ అధికారిగా అవార్డు అందుకున్న తహసీల్దార్ టి రాధికను, రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావును మండల రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీరిని పూలమాల, శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, రీసర్వే టీడీ భారతి, ఆర్ఐ క్రాంతి రేఖ, రత్న కిషోర్, వీఆర్వో నాగేశ్వరరావు, లీలావతి, సుజాత, సుభాషిణి పాల్గొన్నారు.

వేలివెన్నులో కంటి వైద్య శిబిరం

ఉండ్రాజవరం: మండలంలో వేలివెన్నులో ఉండ్రాజవరం మండల మానవత సహకారంతో వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబరం నిర్వహించారు. అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేయగా 80 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేసారు. 22 మందికి ఆపరేషన్ల నిమిత్తం రిఫర్ చేసారు. ఈ కార్యక్రమంలో మానవత మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛను అందజేత



ఏలూరు ఆసుపత్రిలో దుర్గమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ మాధురి

గోపాలపురం: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొవ్వూరుపాడుకి చెందిన వృద్ధురాలు నక్కా దుర్గమ్మ ఏలూరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామ వలంటీర్ మరపట్ల మాధురి తన సొంత ఖర్చులతో ఏలూరు వెళ్లి దుర్గమ్మకు పింఛను అందజేశారు. ఈమెను సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి, ఎంపీటీసీ యడ్లపల్లి సూరిబాబు గ్రామ కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

418 మందికి వైద్య పరీక్షలు

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం వైద్యుల సహకారంతో దేవరపల్లిలో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా 418 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 71 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. రోగులకు ఆశ్రమం ఆసుపత్రిలో ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని వైద్యులు తెలిపారు. వైద్యబృందం ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ ఆర్. శ్రీనివాస్ గౌరవ్, పీఆర్ఓ ఆనంద్‌ను మానవత సంస్థ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. శిబిరాన్ని స్థానిక వైద్యులు కేశిరాజు కాశీవిశ్వనాథం ప్రారంభించారు. మానవత మండల అధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు, జిల్లా కమిటీ సభ్యుడు బళ్ల సూర్యచక్రం, కేశిరాజు రాజ్‌కుమార్, బలుసు సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పప్పు వెంకటరామారావు, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి పథకాల లబ్ధి



కొవ్వూరు ఐదో వార్డులో ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- ఐదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపుతూ రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ముందుకు సాగారు. పట్టణంలో ఐదో వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు అండదండగా ఉండాలని, ఆశీర్వదించాలని కోరారు. పథకాల లబ్ధి పొందడంలో కొందరు ఎదుర్కొంటున్న సాంకేతికపరమైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో పేదలకు మరింత మేలు చేకూర్చే విధంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. టిట్కో ఇళ్ల ప్రాంగణంలో అవసరమైన మౌలిక సదుపాయాలను రానున్న రోజుల్లో సమకూర్చుతామన్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్ పర్సన్ మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన రాజారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, స్థానిక వార్డు కౌన్సిలర్ మద్దిపట్ల శ్రీనివాస్, మద్దిపట్ల దొరబాబు, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు దేవగుప్తాపు లక్ష్మణరావు, నాయకులు భావన రాజేష్, వరిగేటి సుధాకర్, పరిమి వెంకట్రావు, గాడి శరత్‌రాజ్‌కుమార్, గోశాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యం



మద్దులగూడెంలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మద్దులగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం

ద్వారకాతిరుమల: సంక్షేమపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని మద్దులగూడెం పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన ప్రయోజనాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకుని, సంబంధిత బ్రోచర్లను వారికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలు విన్నవించగా, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ పేద ప్రజల కష్టాలను సీఎం జగనన్న చూసి వాటి పరిష్కారానికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్‌బాబు, చెలికాని ప్రవీణ్, పసుపులేటి ఏసుబాబు, లక్కాబత్తుల సిద్ధిరాజు, మానుకొండ ప్రసాద్, బసివిరెడ్డి రాంబాబు, మోటేపల్లి రమేష్, బసివిరెడ్డి సూరిబాబు, మల్లాది కాశీ, బసివిరెడ్డి వెంకట్రామయ్య, సొసైటీ చైర్‌పర్సన్‌లు చెలికాని సంజయ్, గుర్రాల లక్ష్మణ్, ఎంపీటీసీలు పల్లపాటి ధర్మారావు, మానుకొండ కన్నయ్య, చెలికాని బుల్లియ్య, యాచమనేని నాగేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మానుకొండ సుబ్బారావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ భాషా, దిర్శిపాం అన్నవరం, మల్లెపూడి నాగమణి, జానీ, ఇమ్మానియేలు తదితరులున్నారు.

కె.విశ్వనాథ్ చినవెంకన్న సేవకుడే..

ద్వారకాతిరుమల: ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ చినవెంకన్న సేవకుడే. గతంలో ఆయన ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి ఆయన మృతి చెందడంతో స్థానికులు, పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది విశ్వనాథ్ క్షేత్రానికి వచ్చిన ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

శ్రీవారి సేవలో ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని డైరెక్టర్ ప్రొటోకాల్, రాష్ట్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ జీఏడీ (ప్రొటోకాల్), ఏపీహెచ్‌డీసీ, సివిల్ ఏవియేషన్ ఎండీ ఎం.సుబ్రహ్మణ్యం రెడ్డి శుక్రవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

నిడదవోలు: అప్పు తీర్చకుండా చెల్లని చెక్కు ఇచ్చిన వేముల గోపాలరావుకి చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ నిడదవోలు అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాస్ శుక్రవారం తీర్పుచెప్పారు. నిడదవోలుకు చెందిన బాధితుడు తన్నీడి శ్రీనివాసరావు వద్ద డబ్బులు తీసుకుని ఇవ్వకపోవడంతో గోపాలరావుపై 2016 ఏడాదిలో క్రిమినల్ కేసు నమోదైంది.

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

- సమస్యలు ఎవరికి చెప్పాలంటూ నిలదీత
- పెరవలిలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఉన్నతాధికారులు హాజరుకాకుండా దిగువ శ్రేణి ఉద్యోగులను పంపించడం క్షమించరాని నేరమని, ఇటువంటి సమావేశం ఎందుకని ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు నిలదీసారు. పెరవలి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ మండల అధికారులకు సమస్యలు చెబుతామంటే వారంతా సమావేశానికి రావటం లేదని ధ్వజమెత్తారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులమైనా గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం అందడం లేదని ఆరోపించారు. దీనిపై ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ సూపర్ వైజర్లను పిలిచి ప్రశ్నించారు. గ్రామాలకు వెళ్లినప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులను కలవని అధికారులు, ఉద్యోగులను ఎంపీడీఓ రమేష్ నిలదీసారు. సమావేశాలకు హాజరుకాని మండల అధికారులపై నేరుగా ఆయా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా రూ.77.80 లక్షలతో మండలంలోని 18 గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ తెలిపారు. మండలంలో 1,934 ఇళ్లు మంజూరయ్యాయని వీటిలో 443 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని చెప్పారు. మండలంలో 16 జగనన్న లే అవుట్లలో కేవలం 2 రెండు చోట్ల మాత్రమే మెరక పనులు పూర్తయ్యాయని అన్నారు. గ్రామాల్లో అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ నర్సింహమూర్తి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకంలో ఇప్పటి వరకు 1,863 మంది అర్హులుగా గుర్తించామన్నారు. వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్ మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌లో ఎరువులు కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ముఖ్యంగా యూరియా 400 టన్నులు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండో దశ ఇళ్ల నిర్మాణం త్వరలో ప్రారంభం



నల్లజర్ల మండలం పుల్లలపాడు జగనన్న గృహ పథకం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నల్లజర్ల: నవరత్నాలు-జగనన్న ఇళ్లు రెండో దశ కార్యక్రమం ఈనెలాఖరు నుంచి ప్రారంభం కానున్నట్టు గృహనిర్మాణశాఖ డీఈ టి.శేఖర్‌బాబు వెల్లడించారు. గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో మంజూరైన 6,109 ఇళ్ల నిర్మాణానికి సంబంధిత 110 లేఅవుట్లలో నీరు, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు నల్లజర్లలో ఆయన విలేఖర్లకు తెలిపారు. అన్ని లేఅవుట్లు పరిశీలించి ఇళ్ల నిర్మాణాలకు అనువుగా నీరు అందించాలనే విషయంపై గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో కలిసి బోర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే లబ్ధిదారుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. లేఅవుట్లపై ఎక్కడన్నా విద్యుత్ తీగలు ఉంటే వాటిని తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇళ్లు ప్రారంభించుకునే లబ్ధిదారులకు 100 బస్తాల సిమెంట్, 450 కిలోల ఇనుము అందిస్తామన్నారు. సమీప రీచ్‌ల నుంచి ఇసుక ఉచితంగా అందించే ఏర్పాటు చేస్తామన్నారు. సొంత స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకున్న 9,500 మంది పేర్లు ఉన్నతాధికారులకు పంపించామని చెప్పారు. ఇందిరా ఆవాస్‌యోజనా పథకంలో మంజూరైన 3,514 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయన్నారు. మండలంలో వివిధ లేఅవుట్లను ఆయన ఏఈ శివతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

కన్నుల పండువగా నారసింహుని కల్యాణోత్సవం

- కనులారా తిలకించి.. పులకించిన భక్తులు
- జనసంద్రాన్ని తలపించిన ఐఎస్.జగన్నాథపురం క్షేత్రం



అమ్మవార్లకు మాంగల్యధారణ



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఈఓ త్రినాథరావు దంపతులు

ద్వారకాతిరుమల: పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ, మంగళవాయిద్యాలు, అందంగా అలంకరించిన పందిళ్లు, సుగంధభరిత పుష్పమాలలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై శుక్రవారం ఐఎస్ జగన్నాథపురం క్షేత్రంలో సుందరగిరిపై నారసింహ స్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు నయనానందకరంగా సాగిన ఈ కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి, పులకించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుని ఉత్సవ మూర్తులను సుందరగిరిపై నుంచి శుక్రవారం ఉదయం కొండ కింద కల్యాణ మండపం వద్దకు పల్లకి వాహనంలో తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 11.10 గంటల సుముహూర్త సమయంలో స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. ఆ తరువాత వేద మంత్రాలతో మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను పండితులు అట్టహాసంగా నిర్వహించారు. ప్రభుత్వం తరఫున గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దేవస్థానం తరఫున ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, స్వామివారి అన్నప్రసాదాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురం సర్పంచ్‌లు పసుపులేటి ఏసుబాబు, దాకారపు బంగారమ్మ, పసుపులేటి సాయిబాబు, దాకారపు అగ్గియ్య తదితరులున్నారు.

భక్తాంజనేయునికి ఘనంగా పూజలు



నల్లాకులవారిపాలెం భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

పెరవలి: నల్లాకులవారిపాలెంలోని భక్తాంజనేయ స్వామి ఏకాహ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆలయానికి శుక్రవారం మహిళలు పోటెత్తారు. స్వామివారికి తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి లక్ష తమలపాకులతో ఘనంగా పూజలు చేశారు. వేదపండితుల మంత్రఘోషతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు నిర్వహించారు. 108 మంది మహిళలు ఈ పూజలో పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం స్వామివారి ఆలయంలో 150 మంది పిల్లలకు, పెద్దలకు పటిక బెల్లం తులాభారం నిర్వహించగా 2,300 కిలోలు వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు భోజన సదుపాయం ఏర్పాటుచేయడంతోపాటు పిల్లలకు పాలు అందించారు.

నేడు వైఎస్సార్ సీపీ గృహసారథుల సమావేశం

దేవరపల్లి: దేవరపల్లి మండలంలో ఇటీవల నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ గృహసారథులు, గ్రామ వలంటీర్ల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఏవీఆర్ పంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ గృహసారథులు, గ్రామ వలంటీర్లు హాజరుకావాలని ఆయన తెలిపారు.

ఎరువుల దుకాణం సీజ్

పెరవలి: మండలంలో ఎరువుల దుకాణాలపై శుక్రవారం అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒక దుకాణాన్ని సీజ్ చేయగా, మరో దుకాణంలో ఎరువుల నిల్వ లెక్కల్లో తేడాలు గుర్తించి అమ్మకాలు నిలుపుదల చేసారు. మండల వ్యవసాధికారిణి మేరీ కిరణ్ మాట్లాడుతూ ఖండవల్లిలోని ఎరువుల దుకాణంలో రికార్డులు సక్రమంగా లేకపోవటం, నిల్వల్లో వ్యత్యాసాలు గుర్తించి రూ.2,50,639 విలువ కలిగిన 15,285 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసారని తెలిపారు. ఇదే గ్రామంలో డీసీఎంఎస్ నిర్వహిస్తున్న షాపులో స్టాక్ నిల్వల్లో వ్యత్యాసాలు గుర్తించామని, ఇక్కడ రూ.5,19,973 విలువ కలిగిన రూ.24.19 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు, సీఐ రమేష్, వ్యవసాయాధికారి భార్గవ మహేష్ పాల్గొన్నారు.

గో సంరక్షణ కోసం మౌనదీక్ష

కొవ్వూరు: గోవులకు సంరక్షణ కల్పించాలని కోరుతూ గోవు, గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం మౌన దీక్ష చేపట్టారు. పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న గోవులు, ఎద్దులు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయన్నారు. ఆకలికి ఆగలేక ప్లాస్టిక్ వ్యర్థాలను తింటూ అనేక మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. ఈ గోవులను యాజమానులకు అప్పగించాలని, లేదా మునిసిపాలిటీ ద్వారా వాటికి సంరక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన ఏడాది కాలంలో పది గోవులు ప్రాణాలు కోల్పోయినట్టు సమితి నాయకులు వైకే శ్రీనివాస్ తెలిపారు. రోడ్లపై తిరిగే ఆవులు, ఎద్దులను వాటి యజమానులకు అప్పగించేంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీ కృష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, కొండపల్లి రత్నసాయి, మాట్లా అంజనేయులు, చెరుకూరి సాయిరాజు, గోవు, గౌతమీ గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

నిడదవోలు రూరల్: బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) పనిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి అన్నారు. బహుజన సమాజ్ పార్టీ శ్రేణులు చేస్తున్న చైతన్య యాత్ర శుక్రవారం నిడదవోలుకు చేరుకుంది. స్థానిక ఏబీఎస్ టౌన్ హాల్ వద్ద నిర్వహించిన బీఎస్పీ శ్రేణుల సమావేశంలో పరంజ్యోతి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు బహుజనులంతా కృషి చేయాలన్నారు. బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ఎల్.రాజారావు, నాయకులు గెడ్డం సంపత్‌రావు, గుమ్మాపు చిత్రసేన్, తిరుపతిరావు, కొల్లా బత్తుల సత్యం, పి.కనకమహాలక్ష్మి, వెన్నపు సుధాకర్, బయ్యే మునేంద్ర, తాడేపల్లి రాజన్‌బాబు, అంబటి పుల్లారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు సామాజిక న్యాయం

చాగల్లు: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో ఉన్న బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు మట్టా వెంకట్రావు, పిల్లి తిరుమలరావు అన్నారు. చాగల్లు మండలం ఊనగట్లలో వైఎస్సార్‌సీపీ బీసీ సంఘాల నాయకుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్రావు, తిరుమలరావు మాట్లాడుతూ బీసీల కార్పొరేషన్లు ఏర్పాటుచేసి సీఎం జగన్ సముచిత కల్పించారన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించి రాజకీయ, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలబెట్టారన్నారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో బీసీ సామాజిక వర్గాల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అయినం నాగరాజు, బొర్రా కృష్ణారావు, వీరవెల్లి సత్యనారాయణ, తాతా రాఘవ, చిటికెన బాబి, పొన్నాడ సింహాద్రి, మారిశెట్టి సత్తిబాబు, బొర్రా రజిని, మల్లుల వెంకటేశ్వరరావు, తాత శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

నల్లజర్ల: యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, చదువుపై దృష్టి సారించాలని నల్లజర్ల ఎస్సై నరసింహమూర్తి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నల్లజర్లలోని శశి కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యతేజ, కరస్పాండెంట్ బూరుగుపల్లి రంజిత్‌కుమార్,మహిళా సంరక్షణ కార్యదర్శి కొత్తపల్లి సౌజన్య,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

గోపాలపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి అన్నారు. గోపాలపురం మండలం కొవ్వూరుపాడు రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం వ్యవశాయ సలహామండలి సమావేశం మండల వ్యవశాయాధికారి బి రాజారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ పాల్గొన్నారు. వ్యవశాయ సలహా మండలి సభ్యులు ఎస్‌కే ఖాసిం, వి సురేష్, ఎంపీటీసీ యడ్లపల్లి సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మేశ్వర స్వామి ఊరేగింపు

ఉండ్రాజవరం: కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మండలంలోని దమ్మెన్ను గ్రామంలో శుక్రవారం పార్వతీ సమేత ధర్మేశ్వర స్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఎర్రంశెట్టి వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో సర్వేకు శ్రీకారం

గోపాలపురం: డ్రోన్ సహాయంతో మండలంలోని 18గ్రామ పంచాయతీల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి రవీంద్రనాథ్ చెప్పారు. గోపాలపురం మండలం దొండపూడి, సాగిపాడులో శుక్రవారం డ్రోన్‌తో సర్వే పనులకు శ్రీకారం చుట్టారు. మార్చి 7వ తేదీ వరకూ సర్వే కొనసాగుతుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కె కృష్ణ, సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, కాసాని సోమరాజు, మండల యూత్ అధ్యక్షుడు కె నాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

5న రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కొవ్వూరు: రాష్ట్రస్థాయిలో సీఎం కప్ వాలీబాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాల, బాలికల జట్లకి క్రీడాకారుల ఎంపిక కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జి.పవన్‌కుమార్ రాజు ప్రకటించారు. ఈనెల 5న మధ్యాహ్నం 2గంటల నుంచి ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 22న తిరుపతిలో ఈ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొయ్యల ప్రసాద్ సూచించారు. వివరాల కోసం 63085 78996, 93926 69697 నంబర్లను సంప్రదించాలన్నారు.

మానవత ఆర్థిక సాయం

నల్లజర్ల: అచ్చన్నపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఉండ్రాజవరపు గంగరాజుకు రూ.3వేలు, తిమ్మన్నపాలెంలో దూదిపాల గంగరాజుకు రూ.3వేలు, దూబచర్లలో నాయుడురామచంద్రరావుకు రూ.3వేలు అదేగ్రామంలో గాజుల మాణిక్యాలరావుకు రూ.3వేలు శుక్రవారం మానవత ఆర్థిక సాయంగా అందజేసింది. అచ్చన్నపాలెంలో పాతూరి సత్యనారాయణ,కసుకుర్తి కృష్ణారావు బాధితునికి రూ.1,200 అందించారు. మానవత మండలశాఖ అధ్యక్షుడు గుళ్లపూడి వెంకటరత్నం, కండెపు వెంకటసూర్యనారాయణ, భోగవల్లి వెంకటసుబ్బారావు, పాకలపాటి నాగేశ్వరావు, జాలపర్తిగాంధీ, శీమకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం సాధించాలి

నిడదవోలు రూరల్: పది ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తాడేపల్లిగూడెం డివిజన్ డీవైఈఓ రవీంద్రభారతి సూచించారు. మండలంలోని పురుషోత్తపల్లి, చాగల్లు పాఠశాలలను ఆమె శుక్ర వారం మధ్యాహ్న భోజన పథకం, నాడు-నేడు పనులను పరిశీలించారు. హెచ్ఎం డీఎస్‌వీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతను అడ్డుకున్న గ్రామస్తులు

దేవరపల్లి: దేవరపల్లి మండలం లక్ష్మీపురం వద్ద తాడిపూడి, పోలవరం కుడి కాలువ గట్లపై గల చెట్లను కొంతమంది వ్యక్తులు అక్రమంగా నరికి తరలిస్తున్నారు. తాడిపూడి గట్టుపై శుక్రవారం చెట్లను నరుకుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై తాడిపూడి కాలువ ఇరిగేషన్ డీఈఈ చలపతిరావు మాట్లాడుతూ చెట్లు నరకడానికి ఎవరికి ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.